వణికిస్తున్న జ్వరం.. ఆస్పత్రులకు జనం


జిల్లా ఆసుపత్రిలో రోగులు


ఇన్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

తేదీల వారీగా జ్వర పీడితులు

తేదీ	ఔట్ పేషెంట్లు	జ్వర బాధితులు
అక్టోబర్ 19	609	52
అక్టోబర్ 20	375	46
అక్టోబర్ 21	340	46
అక్టోబర్ 22	52	07
అక్టోబర్ 23	235	39
అక్టోబర్ 24	563	16

- జిల్లాలో ప్రబలుతున్న విష జ్వరాలు
- సీజనల్ వ్యాధులతో విలవిల
- జిల్లా ఆస్పత్రికి పోటెత్తుతున్న రోగులు

సిరిసిల్లటౌన్: జిల్లా జనం జ్వరాలతో మంచం పడుతున్నారు. ప్రతి ఇంట్లో జ్వర పీడితులు కనిపిస్తున్నారు. సుమారు రెండు నెలలుగా జిల్లావ్యాప్తంగా డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు విస్తరిస్తున్నాయి. మారుమూల పల్లె నుంచి జిల్లా కేంద్రం సిరిసిల్ల వరకు అన్ని వర్గాలకు చెందిన జనాలు జ్వరాలు, ఒంటి నొప్పులతో విలవిల్లాడుతున్నారు. ప్రతిరోజూ అన్ని మండలాల నుంచి సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి వస్తున్న ఔట్ పేషెంట్లలో అత్యధిక శాతం జ్వర బాధితులుంటున్నారు. మారుతున్న వాతావరణంతో జనాలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న వైనంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

ప్రతి ఇంట్లో జ్వర పీడితులే..

జిల్లావ్యాప్తంగా జ్వరాలతో జనాలు కుదేలవుతున్నారు. ప్రతిరోజు జిల్లాసుపత్రికి వస్తున్న కేసుల్లో 20 శాతం కేసులు వివిధ రకాల జ్వరాలకు సంబంధించినవి కావడం గమనార్హం. సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు జ్వరాల సంఖ్య కొనసాగుతోంది. జిల్లాలో నమోదవుతున్న జ్వరం కేసుల్లో అధిక శరీర ఉష్ణోగ్రతతో పాటు చాలామందికి జలుబు, విరేచనాలు, దగ్గు, ఒళ్లు నొప్పులు, అలర్జీ, తలనొప్పి తదితర లక్షణాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు డెంగీ కేసులు 8 నమోదయ్యాయి. సీజనల్ వ్యాధులతో జనం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగెడుతున్నారు. దోమలు విజృంభించడంతో ప్రజలు విషజ్వరాలు, డయేరియా, రక్తహీనత తదితర రోగాలతో అల్లాడుతున్నారు. నీరు, ఆహార కలుషితం, వాతావరణంలో మార్పులతో ప్రజలకు జ్వరాలతో పాటు విరేచనాలు, మలేరియా, వంటి సీజనల్ వ్యాధులు ముంచుకొస్తున్నాయి. ఎక్కువ మంది ఒంటి నొప్పులు భరించలేకుండా ఉంటున్నారు. అర్హత ఉన్న వైద్యులతో కాకుండా సాధారణ వ్యక్తులతో వైద్యం చేయించుకోవడంతో జ్వరం వచ్చినవారు కనీసం ఐదు రోజులైనా బాధపడుతున్నారు.

20 శాతం జ్వరాల కేసులే..

జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలడంతో నిత్యం సిరిసిల్ల జిల్లాసుపత్రికి 500కు పైగా ఔట్ పేషెంట్లు రాగా, వారిలో 20 శాతం వరకు జ్వర బాధితులే ఉంటున్నారు. వాతావరణంలో మార్పులు, అకాల వర్షాల కారణంగా జనాలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రజలు తమతమ ఇంటి పరిసరాల్లో దోమలు ఆవాసం ఉండకుండా చూసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే అప్రమత్తమై ఎంబీబీఎస్ డాక్టర్లను సంప్రదించాలి. కుంటలు, నీటి ట్యాంకుల్లో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండకుండా చూడాలని, మురుగు నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ వంటివి చల్లాలని సూచిస్తున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో జ్వరాల కేసులు కొనసాగడంతో నివారణ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. జిల్లాసుపత్రిలో సీజనల్ వ్యాధులు, జ్వరాలకు పూర్తిగా మందులు అందుబాటులో ఉన్నాయి.

ఐదు రోజులుగా తీవ్ర జ్వరం



మాది ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట. ఐదు రోజులుగా తీవ్ర జ్వరం వస్తుంది. ఇక్కడ వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. జిల్లాసుపత్రిలో పరీక్షలు చేశారు. రెండ్రోజుల నుంచి వైద్యం అందుతంది. కడుపు నొప్పి, తల తిరగడం, జలుబు ఉంది.

– భూక్య గౌతమి, రాజన్నపేట

ప్లేట్‌లెట్స్ తగ్గినయ్



వారం రోజులుగా ఒంటినొప్పులు, తలనొప్పి, జలుబు, జ్వరం ఉంది. ఆర్ఎంపీతో వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. జిల్లాసుపత్రిలో అన్ని పరీక్షలు చేసింద్రు. ప్లేట్‌లెట్స్ తగ్గినయన్నరు. నీరసంగా ఉంటంది. ఇక్కడ వైద్యం మంచిగా అందుతంది.

– ఎక్కల్‌దేవి అనూష, సిరిసిల్ల

జ్వరాలు తగ్గుముఖం



కొద్ది రోజులుగా జ్వర పీడితుల సంఖ్య తగ్గుతోంది. ఇప్పుడు వచ్చే జ్వరాలతో ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నా.. డెంగీ కేసులు నమోదు కావడం లేదు. సీజనల్ వ్యాధులు మందులతో కంట్రోల్ అవుతున్నాయి. ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాసుపత్రిలో అన్ని రోగాలకు పూర్తిస్థాయిలో మందులున్నాయి.

– డాక్టర్ మురళీధర్‌రావు, సూపరింటెండెంట్, జిల్లా ఆసుపత్రి, సిరిసిల్ల

క్లుప్తంగా

కనులపండువగా కల్యాణం


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

గంభీరావుపేట: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం కనులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

సిరిసిల్లలో ఫ్లాగ్‌మార్చ్

- ప్రజల్లో ధైర్యాన్ని కల్పించేందుకే..
- సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న కేంద్ర బలగాలు

సిరిసిల్లక్రైం: శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు సిరిసిల్ల పట్టణ కేంద్రంలో ఆదివారం బీఎస్ఎఫ్, జిల్లా పోలీసు సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని నేతన్న చౌక్ వద్ద నుంచి పెద్దబజార్, రాళ్లబావి, శాంతినగర్, సిద్ధార్థనగర్, అంబేద్కర్‌నగర్, విద్యానగర్, గీతానగర్, పోలీస్‌స్టేషన్ వరకు ఈ ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శక, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రజలందరికీ పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని ధైర్యాన్ని కల్పించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. వయోజనులందరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటుహక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు కీలకపాత్రను పోషిస్తాయని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సాయుధ బలగాలతో కూడిన బీఎస్ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని ఓటర్లు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాజేందర్

సిరిసిల్లటౌన్: అన్ని పార్టీలు తమకు పెన్షన్లు ఇస్తామని మాత్రమే ప్రకటనలిస్తూ, చేతులు దులుపుకోవడం సరికాదని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మంగళారపు రాజేందర్ అన్నారు. ఆదివారం సిరిసిల్లలోని సత్యసాయి సేవా మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విధి వంచితులమైన తమకు ఉచిత విద్య, వైద్యంతో పాటు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ సమస్యల పరిష్కార అంశాలను అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని, వారికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, చీకోటి అనిల్‌కుమార్, వెల్డి గణేశ్, ఆకుల సంధ్య, బొద్దుల రవి తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

వేములవాడఅర్బన్: హైదరాబాద్‌లో నవంబర్ 18న జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాడానికి నవంబర్ 3న రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి అన్నారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ వస్తున్నారన్నారు. ఈ సభకు ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కానపురం లక్ష్మన్, గుండా థామస్, బిక్షపతి, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా జలేందర్


నియామకపత్రం అందిస్తున్న మేడిపల్లి సత్యం

బోయినపల్లి: మండల యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా బోయినపల్లి గ్రామానికి చెందిన గుంటి జలేందర్‌ను నియమిస్తున్నట్లు చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం తెలిపారు. ఈ మేరకు జలేందర్‌కు మేడిపల్లి సత్యం నియామకపత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులకు జలేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

చెట్లను నరికారు..



చందుర్తి: మండలంలోని బండపల్లి గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపుల నాటిన కోనోకార్పస్ మొక్కలు పచ్చని చెట్లుగా ఎదిగాయి. కొమ్మలు ఎత్తుగా పెరిగి, విద్యుత్ తీగలు తాకుతుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని పంచాయతీ సిబ్బంది వారం రోజుల క్రితం కొమ్మలను నరికివేయడంతో మోడుగా మిగిలాయి. నాటే ముందే విద్యుత్ తీగలు ఉన్నాయని మొక్కలను నాటకుండా వదిలేస్తే కనీసం గ్రామపంచాయతీ ఆర్థిక భారం తగ్గేదని గ్రామస్తులు వాపోతున్నారు. సుమారు గ్రామంలోని 100 పైగా చెట్లను తొలగించడంతో మూడేళ్లలో వాటికి ఖర్చు చేసిన వ్యయం రూ.లక్షల్లో ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ముందు చూపు లేకుండా మొక్కలు నాటి, విద్యుత్ తీగలకు తాకడంతో వాటిని తొలగించడం గ్రామంలో విమర్శలకు తావిస్తుంది.

కేసీఆర్ వస్తే పురోగతి.. కాంగ్రెస్ గెలిస్తే అధోగతి

- జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు
- రసమయికి ఓటు వేయాలని ప్రచారం


ఇల్లంతకుంటలో ప్రచారం చేస్తున్న సిద్ధం వేణు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలోని రంగంపేట, పాండలపురం గ్రామాల్లో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు ఆధ్వర్యంలో ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, కాంగ్రెస్ వస్తే రాష్ట్రం తిరోగమిస్తుందన్నారు. కాంగ్రెస్ కపట మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు ముత్యం అమర్, సారుగు వజ్రవ్వ, మధు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే అంధకారమే



ఎల్లారెడ్డిపేట: ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ రాష్ట్రం అంధకారంగా మారుతుందని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, అల్మాస్‌పూర్, అక్కపల్లి, దుమాల, ఎల్లారెడ్డిపేటలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు


దమ్మన్నపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండలంలోని దమ్మన్నపేట, నాగంపేట, లక్ష్మీపూర్ తండాల్లో ఆదివారం బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ఇంటింటికీ అందిస్తూ కేటీఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, మండల ఎంపీటీసీల ఫోరం మాజీ కన్వీనర్ కొమిరిశెట్టి లక్ష్మణ్, మానేరు నీటి సంఘాల మాజీ చైర్మన్ వంగ సురేందర్‌రెడ్డి, మండల గౌడ సంఘం అధ్యక్షుడు చేరాల వెంకటస్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'కారు గుర్తుకు ఓటేద్దాం సారునే గెలిపిద్దాం'


ప్రచారం చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లిలో ఇంటింటికీ, షాపు షాపుకి బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకుడు సిలివేరి చిరంజీవి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మంత్రి కేటీఆర్ నాయకత్వంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించి కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

బీఎస్పీ కార్యాలయం ప్రారంభం

వీర్నపల్లి: మండల కేంద్రంలో బీఎస్పీ కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో ఈ నవంబర్ 1న జరిగే సిరిసిల్ల బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సిరిసిల్ల సింహగర్జన సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమురయ్య, తిరుపతి, అనిల్, సాయిలు, రవి, శ్రీనివాస్, సుదాకర్, నర్సయ్య, శంకర్, నరసయ్య, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

'కారుకు మళ్లీ ఓటేస్తే బేజారే'


రామన్నపల్లిలో రైతులతో కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు మళ్లీ ఓటేస్తే బేజారు కావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ (టోని) అన్నారు. మండలంలోని రామన్నపల్లెలో వ్యవసాయ క్షేత్రాల్లో ఆదివారం రైతులకు వద్దకు వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకుల ఆగడాలు శృతిమించాయని అన్ని మాఫియాలకు అడ్డాగా ఆ పార్టీ మారిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసిన కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని కాంగ్రెస్ పేదల పక్షపాత పార్టీ అని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం తిరిగి రావాలంటే బీఆర్ఎస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ


మొర్రాయిపల్లెలో ప్రచారం చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: పేద బడుగు, బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్, మొర్రాయిపల్లె గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ అరాచక పాలనతో విసిగిపోయామని ప్రజలు భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని, మహిళలకు ఉచిత బస్ రవాణా, రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షలు, రైతులకు ఉచిత విద్యుత్, రైతులకు ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, వంగ మోహన్‌రెడ్డి, కుమార్‌యాదవ్, కొండయ్య, రమేశ్, తలారి నర్సింలు, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఎస్పీ ప్రచారం షురూ


బీఎస్పీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ప్రేమ్‌కుమార్

తంగళ్లపల్లి: మండలంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఎన్నికల ప్రచారం ఆదివారం ప్రారంభమైంది. ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండు ప్రేమ్‌కుమార్ మండలంలోని పలు గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలు చైతన్యం కావాలని సిరిసిల్ల ఎమ్మెల్యేగా బీసీ బిడ్డ పిట్టల భూమేశ్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం బీఎస్పీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆయన వెంట పలువురు బీఎస్పీ నాయకులు ఉన్నారు.

'చల్మెడ' గెలుపు కోసం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



కోనరావుపేట: మండల కేంద్రంలోని అగ్నిజ్వాల పెంతెకోస్తుమినిస్ట్రీస్ చర్చిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు గెలవాలని కోరుతూ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఎంపీటీసీ చారి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన చెట్ల కొమ్మలు



గంభీరావుపేట: మండల కేంద్రం నుంచి నర్మాల గ్రామానికి వెళ్లే రోడ్డును చెట్ల పొదలు కమ్మేశాయి. వాహనదారులకు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చెట్ల కొమ్మలన్నీ సగం రోడ్డును ఆక్రమించాయి. ప్రొటెక్షన్ సైడ్ రాక్స్ దాటి చెట్ల పొదలు రోడ్డు పైకి వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అరుదైన సీతాఫలం చెట్టు



వీర్నపల్లి: మండల కేంద్రంలోని శ్మశానవాటిక ఏరియాలో 2016లో ఉపాధిహామీ పథకంలో భాగంగా దాదాపు రెండు వేల సీతాఫలాల మొక్కలను నాటారు. అందులోని ఒక చెట్టు పెద్దగా పెరిగి కాయలు కాశాయి. దాని కాయలు నల్ల రంగులో ఎండిపోయినట్లు కనిపిస్తున్నాయి. కాని తెంపి చూస్తే నల్లగా ఉన్నా, లోపల తెల్ల గుజ్జుతో మామూలు సీతాఫలం లాగే ఉండి చాలా రుచిగా ఉంది. స్థానికులు ఈ సీతాఫలాలను చూసి ఆశ్చర్యానికి గురయ్యారు.